నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, గురువారం 9 జనవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

*వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కొందరు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌వో) ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పని వేళలను పాటించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. సారు ఎప్పుడొస్తారో తెలియక బాధితులు గంటల కొద్దీ ఎదురుచూస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో 47 పోలీస్ స్టేషన్లుండగా.. కొద్ది మంది మాత్రమే స్థానిక క్వార్టర్లలో ఉంటున్నారు. మిగతా వారంతా వరంగల్‌లో ఉంటూ అప్ అండ్ డౌన్ చేస్తుండడంతో స్టేషన్‌కు సమయానికి రాలేకపోతున్నారు. కొందరు 11 గంటలకు వచ్చినా.. వెంటనే బందోబస్తు, విచారణ, ఏసీపీ, సీపీ మీటింగ్ పేరుతో బయటకు వెళ్తున్నారు. మరికొందరు మధ్యాహ్నం తర్వాత వస్తుండగా.. మిగతా వారు రాత్రి 7 గంటల తర్వాతే బాధితులకు అందుబాటులో ఉంటున్నారు. దీంతో స్టేషన్‌కు వచ్చే వారు ఇన్‌స్పెక్టర్ల కోసం వేచి చూస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్సైలు మాత్రం పెండింగ్ కేసులు ఎక్కువవుతుండడంతో పాటు తమకు పని భారం పెరుగుతుందంటున్నారు.* - సుబేదారి, జనవరి 8

# సారు.. ఎప్పుడొస్తరో?

## ఎస్‌హెచ్‌వోల కోసం బాధితుల ఎదురుచూపులు

- పోలీస్ స్టేషన్లకు సమయానికి రాని ఇన్‌స్పెక్టర్లు
- పనివేళలు పాటించడంలో ఇష్టారాజ్యం
- ఎస్సైలపై పెరుగుతున్న పని భారం
- కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న పెండింగ్ కేసులు




వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 47 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లుండగా, నగర పరిధిలో పది, మిగతావి 15 నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇందులో చాలా స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్లే స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ఉన్నారు. వీరిలో చాలా మంది వరంగల్‌లో ఉంటూ స్టేషన్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. పనివేళలు పాటించకపోవడంతో పర్యవేక్షణ గాడితప్పుతున్నది. బాధితులు రిసెప్షన్ విభాగంలో ఫిర్యాదు అందజేసిన తర్వాత రశీదు ఇచ్చి సారు లేడు.. రేపు రండి అని చెబుతున్నారు. ఈ క్రమంలో అడ్మిన్ ఎస్సైలు బాధితుల ఫిర్యాదులపై స్పందించడంలేదు. ఏదైనా సమస్య వస్తే తామే బాధ్యులమవుతామని వెనుకడుగువేస్తున్నారు. చాలా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసిన బాధితులను పది రోజుల వరకు కూడా ఇన్‌స్పెక్టర్లు కలవకపోవడంతో వారికి న్యాయం జరగడం లేదు. దీనికి తోడు ఇన్‌స్పెక్టర్లు ఆదేశాలిచ్చే వరకు ఫిర్యాదులపై ఎస్సైలు కేసులు నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో విచారణలో జాప్యం జరిగి, కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలుస్తున్నది. సీపీ నెలవారీ నేర సమీక్షలో చాలామంది ఈ విషయంలో చివాట్లు తింటున్నప్పటికీ మార్పు రావడంలేదు.

### రాత్రి వేళ ఎస్సైలే దిక్కు..

రాత్రివేళ శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎస్సైలే దిక్కవుతున్నారు. ఇన్‌స్పెక్టర్లు రొటేషన్‌లో వారంలో ఒక రోజు నైట్ పెట్రోలింగ్ చేసి ఉదయం ఇంటికి చేరుకుంటున్నారు. నైట్ పెట్రోలింగ్ చేసిన మరుసటిరోజు స్టేషన్‌కు రావడానికి కొందరు ఇన్‌స్పెక్టర్లు విముఖత చూపుతున్నారు. ఈ సమయంలో గ్రామాల్లో రాత్రివేళ ఏవైనా ఘటనలు జరిగితే ఎస్సైలే అక్కడికి చేరుకుంటున్నారు. రాత్రి కొంతమంది సిబ్బంది మాత్రమే డ్యూటీలో ఉంటుండడంతో ఏదైనా ఘటన జరిగినప్పుడు పోలీసులు సకాలంలో చేరుకోవడం లేదు. దీనికి తోడు కమిషనరేట్ పరిధిలోని హైదరాబాద్, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, కరీంనగర్ హైవేలపై రాత్రి వేళ ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత ఇన్‌స్పెక్టర్లు స్టేషన్ క్వార్టర్స్‌లో లేకపోవడంతో పోలీసులు వెంటనే స్పందించడం లేదు. సిబ్బంది ద్వారా సమాచారం అందుకునే సదరు ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలానికి చేరుకోవడం ఆలస్యమై క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందుతున్నారు. ఈ పరిస్థితి హైవేల్లోని రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, ఎల్కతుర్తి, ఆత్మకూరు, పరకాల, మామునూరు, గీసుగొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉంది.

### ఇష్టానుసారంగా డ్యూటీ..

కొందరు ఇన్‌స్పెక్టర్లు డ్యూటీ వేళల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని పరకాల, వర్ధన్నపేట, కాజీపేట, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, నర్సంపేట డివిజన్ల పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు వరంగల్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో చాలామంది మధ్యాహ్నం తర్వాత స్టేషన్ నుంచి బయటకు వెళ్లి, లంచ్‌కు ఇంటికి వచ్చి కునుకు తీసి సాయంత్రం 6 తర్వాతే స్టేషన్‌కు వెళ్తున్నట్లు తెలుస్తున్నది. బాధితులు ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు వారి కోసం పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలో బాధితులు ఊళ్లకు వెళ్లేందుకు రాత్రి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పోలీసు స్టేషన్‌లో అందుబాటులో ఉండని ఇన్‌స్పెక్టర్లపై దృష్టి సారించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాంగ్రెస్ ఎగ్గొట్టిన హామీలతో కూడిన బెలూన్లను ఎగురవేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

# ముగ్గులేసి.. హామీలపై ప్రశ్నించి

- కాంగ్రెస్ గ్యారెంటీలపై మహిళల వినూత్న నిరసన
- బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసులో ముగ్గుల పోటీలు
- పతంగులు ఎగురేసి.. బెలూన్లు వదిలిన బీఆర్‌ఎస్ నేతలు
- హామీలు మరిచిన ప్రభుత్వంపై అన్ని వర్గాల అసంతృప్తి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, జనవరి8: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రంగవల్లుల పోటీలు నిర్వహించగా, మహిళలు కాంగ్రెస్ హామీలను ప్రశ్నిస్తూ వినూత్నంగా ముగ్గులు వేశారు. ప్రతి ముగ్గులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. 'వడ్లకు బోనస్ కట్.. రైతులకు రైతు బంధు ఏదీ?.. కౌలు రైతులకు భరోసా లేదే.. తులం బంగారం, స్కూటీలు, రూ.2500 ఎప్పుడిస్తారని ముగ్గులు వేసి మరీ ప్రశ్నించారు. ఈ పోటీల్లో 4వ డివిజన్‌కి చెందిన ఎం కల్పన మొదటి, రెండు, మూడో స్థానాల్లో 49, 54వ డివిజన్లకు చెందిన పీ పర్ణిక, ఏ మానస నిలవగా, ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని బహుమతులు అందజేశారు. అదేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీ లవ్ కేటీఆర్, వీ ఆర్ విత్ కేటీఆర్, కాంగ్రెస్ 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని బెలూన్లు, పతంగులపై రాసి ఎగురవేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు మరిచిన కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు గాయబ్ అయ్యాయని.. 420 హామీలు వట్టి మాటలే అని రుజువైందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో విధ్వంసం, పోలీసుల పాలన సాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నడుస్తుంది ప్రజాపాలన కాదని, ప్రతీకార పాలన అన్నారు. కేసీఆర్ మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప వారికి చేసిందేమిటని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీగా బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుంటే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ రోజు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి రైతు డిక్లరేషన్ బోగస్ అయ్యిందని ఆరోపించారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయడం లేదని, రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. హైదరాబాద్ కీర్తిని పెంచే ప్రయత్నంలో ఫార్ములా ఈ రేస్‌ను నిర్వహించారని, ప్రభుత్వ అ కౌంట్ నుంచి నిర్వహణ సంస్థకు నగదు పంపిణీలో ఎక్కడా కేటీ ఆర్ జోక్యం లేనప్పుడు అవినీతి ఎలా అవుతుందన్నారు. ప్రశ్నిస్తూ, నిలదీస్తున్నందుకే కేసులు పెడుతున్నారని, గతంలో పలు అంశాల్లో కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తామని మంత్రులు అనడం వారి కుట్రలకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆపమని, కేటీఆర్‌కు అండగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఉద్యమిస్తాయని దాస్యం స్పష్టం చేశారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజక వర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ చెన్నం మధు, బొండు అశోక్ యాదవ్, లోహిత రాజు, రజిత, జ్యోతి, పోలపల్లి రామ్మూర్తి, జోరిక రమేశ్, జానకీరాములు, రఘు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







కాంగ్రెస్ సర్కారు హామీలను ప్రశ్నిస్తూ హనుమకొండ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

# ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో ఆ ఊళ్లు మిస్

## సర్వే అప్లికేషన్‌లో గల్లంతైన వెంకటాపురం, అల్లిగూడెం పంచాయతీలు




వెంకటాపురం పంచాయతీ భవనం

- లాగిన్ కాకపోవడంతో ప్రారంభం కాని సర్వే
- ఆందోళన చెందుతున్న ఎనిమిది గ్రామాల ప్రజలు
- మాకు ఇళ్లు వస్తాయో లేవోనని ఆవేదన



బయ్యారం, జనవరి 8 : ఇందిరమ్మ ఇండ్ల సర్వే తుది దశకు చేరుకోగా మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఓ రెండు గ్రామపంచాయతీల్లో మాత్రం సర్వే ప్రారంభం కాకపోవ డంతో అక్కడి ప్రజలు తమకు ఇండ్లు వస్తాయా ? రావా ? అంటూ ఆందోళన చెందుతున్నారు. మండలంలో 29 జీపీలు ఉండగా 27 పంచాయతీల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే తుది దశకు చేరుకుంది. కానీ ఇందిరమ్మ ఇండ్ల సర్వే యాప్ ఓపెన్ చేస్తే అల్లిగూడెం, వెంకటాపురం(లక్ష్మీపురం) పంచాయతీల పేర్లు మాత్రం చూపించడం(లాగిన్) లేదు. దీంతో అక్కడ ఇంకా ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రారంభం కాలేదు. వెంకటాపురం జీపీలో లక్ష్మీపురం, కొత్తలక్ష్మీపురం, టేకులగూడెం, నర్సా పురం గ్రామాల్లో 272 కుటుంబాలతో 438 మంది జనాభా, అల్లిగూడెం జీపీలో బీమ్లా తండా, అల్లిగూడెం, దోరన్న తండా, పందిపంపుల గ్రామాల్లో 282 కుటుంబాలతో 510 మంది జనాభా ఉన్నారు. ఇందులో అధిక శాతం పేద గిరిజన కుటుంబాలకు చెందిన వారు ఉండగా, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కోసం అధికారులు ఇంటింటికి వస్తుండగా తమ గ్రామాల్లో మాత్రం సర్వే ఎందుకు చేయడం లేదో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. తమకు ఇందిరమ్మ ఇండ్లు వస్తాయో.. రావో..? అంటూ ఆందోళన చెందుతన్నారు. తమ గ్రామాల్లో సర్వే ఎప్పుడు చేస్తారంటూ జీపీ సెక్రటరీలను ప్రజలు ప్రశ్నిస్తుండడంతో వారికి ఏం చెప్పాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో విజయలక్ష్మిని వివరణ కోరగా.. అల్లిగూడెం, వెంకటాపురం జీపీలు ఇందిరమ్మ ఇండ్ల సర్వే యాప్‌లో లాగిన్ కాకపోవడంతో అక్కడ సర్వే ప్రారంభించని మాట వాస్తవమే. ఈ విషయాన్ని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, సీఈవో దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

### అధికారులెవరూ రాలే..



ఇల్లు కావాలని ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాం. కొద్ది రోజుల క్రితం ఇందిరమ్మ ఇండ్ల సర్వే కోసం అధికారులు ఇంటింటికి వస్తారని గ్రామంలో చెప్పిన్రు. కానీ ఇంత వరకు ఎవరూ రాలే. కొన్ని ఊళ్లల్లో ఇండ్ల కోసం సర్వే చేస్తున్నారంట. మా ఊరికి అధికారులు ఎప్పుడొస్తరో తెలవడం లేదు. సర్వే చేసి ఇల్లు మంజూరు చేస్తే కట్టుకుంటాం.

– అనసూర్య, వెంకటాపురం

### ఇందిరమ్మ సర్వే ప్రారంభించాలి..




ఇందిరమ్మ ఇండ్ల సర్వే వెంటనే ప్రారంభించాలి. యాప్‌లో మా గ్రామం పేరు లాగిన్ కాకపోవడం వల్లనే ఇంకా సర్వే ప్రారంభించలేదని అధికారులు చెప్పున్రు. వెంటనే సమస్య పరిష్క రించి ఇంటింటి సర్వే చేపట్టాలి. లేకుంటే మాన్యువల్ గానైనా చేపడితే బాగుంటుంది. ఇంకా సర్వే మొదలు పెట్టకపోవడం వల్ల గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

– నారాయణ, అల్లిగూడెం

# 'స్మార్ట్'గా ఫోన్ కొట్టేశారు !

### గుర్తుతెలియని వ్యక్తి చేతిలో మోసపోయిన సెల్‌పాయింట్ వ్యాపారి




యజమానితో నిందితుడు చేసిన వాట్సాప్ చాటింగ్

డోర్నకల్, జనవరి 8 : రైల్వే అధికారినంటూ ఓ వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి డోర్నకల్‌కు చెందిన ఓ సెల్‌పాయింట్ వ్యాపారి మోసపోయాడు. వివరాలిలా ఉన్నాయి. డోర్నకల్‌లోని పద్మావతి సెల్ పాయింట్ వ్యాపారి అభిషేక్ జైన్‌కు గతేడాది డిసెంబర్ 24న ఒక వ్యక్తి ఫోన్ చేసి తన పేరు శ్రీనివాస్‌రావు అని రైల్వే లోకో పైలట్‌గా పనిచేస్తానని ఒక ఖరీదైన స్మార్ట్‌ఫోన్ కావాలని అడిగాడు. వివరాలను వాట్సాప్‌లో వివరాలు కూడా పెట్టాడు. దీనికి వ్యాపారి వివో వి40 ఫోన్ ఖరీదు రూ.35 వేలు ఉంటుందని చెప్పాడు. మొదట వ్యాపారి బ్లూకలర్ ఫోన్ తెప్పించగా, లేదు నాకు పర్పుల్ కలరే కావాలనడంతో అదే తీసుకొచ్చి షాప్ పెట్టాడు. తర్వాత అతడికి కాల్ చేసి సార్ ఫోన్ తెచ్చాను.. తీసుకెళ్లండి అని చెప్పాడు. కానీ అతడు షాప్‌కు రాకుండా 'నేను రైల్వేస్టేషన్‌లో బిజీగా ఉన్నాను.. మీరు సెల్‌ఫోన్ తీసుకొని రండి.. అమౌంట్ ఇచ్చి ఫోన్ తీసుకుంటా'ని చెప్పాడు. నిజమేనని నమ్మిన వ్యాపారి.. రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి సార్ బిజీగా ఉన్నారు.. ఇవి చాలా ఇంపార్టెంట్ పేపర్స్ పట్టుకోండి.. మీరు ఫోన్ ఇస్తే సార్‌కు చూపించి వస్తానని ఫోన్ తీసుకొని వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ అతడు తిరిగిరాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. ఈమేరకు బాధితుడు అభిషేక్ జైన్ ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, సివిల్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

# అన్నం పెడతామని పిలిచి.. ఇంటికి కన్నం

- నమ్మించి మోసం చేసిన పక్కింటి వ్యక్తి
- భార్య వడ్డిస్తుండగానే అతడి ఇంట్లోకి వెళ్లి చోరీ
- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- రూ. 26.50 లక్షల విలువైన బంగారం, వెండి సహా నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మానుకోట ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 8 : అన్నం పెడతామని పిలిచి ఓ దుండగుడు సదరు వ్యక్తి ఇంటిని దోచేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలోని నర్సింహులపేట మండలంలో చోటు చేసుకోగా, 24 గంటల్లోనే పోలీసులు కేసు ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను టౌన్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. నర్సింహులపేటకు చెందిన ఏరనాగ సీతారాములుకు ఇద్దరు కుమారులుండగా, పెద్దవాడు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. చిన్న కొడుకు, కోడలు మహబూబాబాద్‌లోని ఏకలవ్య మోడల్ స్కూల్లో విధులు నిర్వర్తిస్తూ రోజు వెళ్లి వస్తుంటారు. కాగా, సీతారాములు బంగారం, వెండి కుదువబెట్టుకొని అవసరమున్న వారికి వడ్డీకి అప్పులిస్తుంటాడు. ఆయన ఇంటి పక్కనే కోటగిరి రవి కుటుంబం ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం సీతారాములు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాము చేపల కూర వండామని, అన్నం తిని వెళ్లమంటూ రవి పిలిచాడు. ఈ క్రమంలో రవి భార్య భోజనం వడ్డిస్తుండగానే ఇదే అదునుగా భావించిన రవి సీతారాములు ఇంట్లోకి వెళ్లి బీరువా తాళం పగుల కొట్టి అందులో ఉన్న బంగారం, వెండి, నగదును దోచుకెళ్లాడు. సాయంత్రం కుమారుడు వచ్చి దొంగతనం జరిగినట్లు గుర్తించి ఇంటి పక్కనున్న రవి పైనే అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రవిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించగా చేసిన అప్పులు తీర్చేందుకు, జల్సాగా జీవించేందుకు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. మొత్తం సొమ్మును పొలం వద్ద దాచి పెట్టినట్లు చెప్పడంతో అక్కడికి వెళ్లి బంగారం, వెండి నగలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 26.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న సీసీఎస్ సీఐ హతీరామ్, ఎస్సైలు తాహెర్ బాబా, గోపి, సిబ్బందిని ఆయన అభినందించారు.

- మా భూమిని ఎట్లా సర్వే చేస్తారని ఆగ్రహం
- అనుమతి లేకుండా ఎలా వచ్చారంటూ మండిపాటు
- వెనుదిరిగిన సర్వే ఏడీ శ్రీనివాసులు



ఏడీ శ్రీనివాసులుతో వాగ్వాదం చేస్తున్న బాధితులు

# అధికారులపై మర్లవడ్డ దళితులు

నయీంనగర్, డిసెంబర్ 8 : పంటలు సాగు చేసుకొని జీవనం కొనసాగించేందుకు కొన్నేళ్ల క్రితం హనుమకొండ పరిధిలోని బీమారం, కోమటిపల్లి గ్రామాల్లోని పలువురు దళితులకు ప్రభుత్వం భూమిని అప్పగించింది. దీనిపై ప్రైవేట్ వ్యక్తుల కన్ను పడడంతో కబ్జా చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా బుధవారం ఈ భూమిని సర్వే చేసేందుకు సదరు వ్యక్తులు ఏడీ శ్రీనివాసులుతో అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు అక్కడికి పెద్ద ఎత్తున చేరుకొని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ భూమి తమదని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారని, తమ అనుమతి లేకుండా భూమిలోకి ఎలా వస్తారంటూ మండిపడ్డారు. పలువురు ప్రైవేట్ వ్యక్తులు ఇక్కడి భూమిని తమకు ఇదివరకే అమ్మారని, తమను ఎవరూ ఏమీ చేయలేరంటూ కొందరి అండ చూసుకుంటూ ప్రతి సంవత్సరం బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీ లేక ఏడీ శ్రీనివాసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



## పల్లెల్లో గంగిరెద్దుల సందడి..

బయ్యారం, జనవరి 8 : సంక్రాంతి పండుగ సందర్భంగా పల్లెల్లో గంగిరెద్దుల సందడి మెదలైంది. పండగ వేళ ఇల్లిల్లు తిరుగుతూ.. ఇంటి ముందుకు బసవన్న వచ్చి చేసే విన్యాసాలు పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మరికొద్ది రోజుల్లో సంక్రాంతి పండుగ ఉండగా బయ్యారం మండలంలోని గ్రామాల్లో బుధవారం బసవన్నల రాకతో పండుగ శోభ వచ్చేసింది.

# సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

- వరంగల్ రీజియన్ నుంచి 660 ఏర్పాటు
- ముఖ్య బస్ స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లు
- దిశా నిర్దేశం చేయనున్న సూపర్‌వైజర్లు
- ప్రయాణికులకు అన్ని సౌకర్యాల కల్పన
- వెల్లడించిన రీజనల్ మేనేజర్ విజయభాను

హనుమకొండ చౌరస్తా, జనవరి 8 : సంక్రాంతి పండుగ సందర్భంగా వరంగల్ రీజియన్‌లో ట్రాఫిక్‌కు అనుగుణంగా ఈ నెల 13 వరకు 660 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజనల్ మేనేజర్ డీ విజయభాను తెలిపారు. ఈ ఏడాది మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వారికి రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా రీజియన్ పరిధిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. హనుమకొండ నుంచి ఉప్పల్, పరకాల, భూపాలపల్లి, కాళేశ్వరం, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, జనగామకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు, అక్కడి నుంచి హనుమకొండ వరకు నడిపే బస్సుల వివరాలను డిపోల వారీగా ఆయన వెల్లడించారు. హనుమకొండ డిపో నుంచి 90, జనగామ 90, వరంగల్-1 నుంచి 92, వరంగల్-2 డిపో నుంచి 92, మహబూబాద్ 56, నర్సంపేట 56, పరకాల 56, తొర్రూరు 74, భూపాలపల్లి 54, మొత్తం 660 బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ సారి కొత్తగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు కూడా ప్రయాణికులకు ఉప్పల్-హనుమకొండ రూట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు దిశానిర్దేశం చేసేందుకు అన్ని ముఖ్య బస్‌స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఉప్పల్ నుంచి ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో టెంట్లు, షామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. 24 గంటలు అధికారులు, సిబ్బంది ప్రయాణికులకు సేవలందించనున్నారన్నారు. అలాగే జాతర సందర్భంగా హనుమకొండ నుంచి కొత్తకొండ, వరంగల్ నుంచి ఐనవోలు, జనగామ నుంచి కొమురవెల్లికి పండుగ రోజుల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ముందస్తు రిజర్వేషన్ల కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆర్‌ఎం సూచించారు.

